క్లుప్తంగా

బ్లాక్‌మార్కెట్‌ను నియంత్రించాలి



తాడిమర్రి నుంచి అన్నదాత పోరుకు తరలుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడిమర్రి: ఎరువులు బ్లాక్‌మార్కెట్‌కు తరలకుండా నియంత్రించాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మంగళవారం ధర్మవరంలో చేపట్టిన అన్నదాత పోరుకు తాడిమర్రి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు కుంటాల పుల్లయ్య, పార్టీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, మండల యువజన కన్వీనర్ సిద్దే మోహన్‌రెడ్డి, నాయకులు యలక శ్రీనివాసరెడ్డి, పాటిల్ ప్రకాష్‌రెడ్డి, మదమంచి మల్లికార్జున నాయుడు, గుజ్జల హనుమంతు, కో ఆప్షన్ సభ్యులు బాబాఫక్రొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించడం, కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలతో రైతన్నలను దగా చేయటాన్ని నిరసిస్తూ ధర్మవరంలో చేపట్టిన 'అన్నదాత పోరు'కు బత్తలపల్లి మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్ కుమార్, నియోజకవర్గ కల్చరల్ వింగ్ ప్రెసిడెంట్ షరాబ్ యోగానంద ఆచారి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, ఉపాధ్యక్షులు బ్యాల్ల పెదయ్య, రైతు సంఘం మండల అధ్యక్షులు ప్రభాకరరెడ్డి, నాయకులు ముష్టూరు నరసింహారెడ్డి, బండి వీరనారప్ప, రాజవీరారెడ్డి, కుమ్మర సుధాకర్, సాకే సురేష్, పోతలయ్య, వ్యాపారం పెద్దప్ప, చంటి, మహేష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగా పోటీల్లోలో ప్రతిభ



మెరిట్ సర్టిఫికెట్ అందుకుంటున్న సంధ్య

కదిరి అర్బన్: పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ నెల 7న జరిగిన 50వ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో కదిరి మండలం ఎరుకులవాండ్లపల్లి హరీష్ పాఠశాల విద్యార్థిని సంధ్య అండర్ 12–14 కేటగిరీల్లో టాప్ 6లో నిలిచింది. జిల్లా తరఫున ఉత్తమ ప్రతిభ కనబరిచి మెరిట్ సర్టిఫికెట్ అందుకుంది. తమ విద్యార్థిని టాప్ 6లో రాణించడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ కిరణ్ తెలిపారు.

విద్యాసంస్థలకు సెలవులా..?

కదిరి అర్బన్: అనంతపురంలో సూపర్ సిక్స్ – సూపర్ హిట్ విజయోత్సవ సభకు సీఎం చంద్రబాబు హాజరవుతున్న నేపథ్యంలో బుధవారం విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వడాన్ని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో ఖండించారు. తల్లికి వందనం కింద రూ. 15వేలు ఇస్తామని చెప్పి రూ.13 వేలు ఇవ్వడం సూపర్ హిట్ ఎలా అవుతుందన్నారు. 18 ఏళ్లు పైబడి 59 ఏళ్లలోపు మహిళలకు రూ.ప్రతి నెలా 1500 ఇస్తానన్న ఆడబిడ్డ నిధి ఏమైందని ప్రశ్నించారు. తూతూ మంత్రంగా పథకాలు అమలు చేసి సూపర్ హిట్ అంటే ఎలావిమర్శించారు. బీసీలకు 50 ఏళ్లకే ఇస్తామన్న రూ.4 వేలు పెన్షన్ ఏమైందని నిలదీశారు. విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాల అనుమతిని నిషేధిస్తూ తీసుకువచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రక్తదానం.. ప్రాణదానమే

ధర్మవరం: రక్తదానం.. ప్రాణదానం చేయడంతో సమానమని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఎల్‌పీ సర్కిల్‌లోనున్న పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏపీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రజిని హెల్పింగ్ హ్యాండ్స్ అండ్ రక్తబంధం సౌజన్యంతో రెడ్ క్రాస్ సొసైటీ మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీఐ నాగేంద్రప్రసాద్, ఏపీఎస్‌ఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు రాఘవేంద్ర హాజరయ్యారు. అనంతరం రక్తదానం చేసిన వారికి రూ.లక్ష ప్రమాద బీమా, ప్రశంసా పత్రం, మొమెంటో, శాలువాలతో సత్కరించారు.

హోరెత్తిన అన్నదాత పోరు



పుట్టపర్తిలో ర్యాలీగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట, వైఎస్సార్ సీపీ నేతలు



పుట్టపర్తి ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఎరువుల పంపిణీలో కూటమి ప్రభుత్వం విఫలం
- అమరావతి జపంతో రాష్ట్రాన్ని దివాళా తీయించారు
- పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధ్వజం

పుట్టపర్తి అర్బన్: ఎరువుల కొరతపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'అన్నదాత పోరు' రైతులతో హోరెత్తింది. పంటలు సాగు చేసుకున్న రైతులకు సకాలంలో ఎరువులు అందించలేని చేతగాని ప్రభుత్వంగా 'కూటమి' నిలిచిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి తరలివచ్చిన నాయకులు రైతులతో కలిసి ర్యాలీగా గణేష్ సర్కిల్, మార్కెట్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం చేరుకున్నారు. కార్యాలయ ఆవరణలో బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూరియా ఇవ్వలేని చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోవాలని దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువుదీరాక.. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందన్నారు. అమరావతి జపం చేస్తూ రాష్ట్రాన్ని దివాళా తీయించారని మండిపడ్డారు. వందల సంఖ్యలో హామీలు ఇచ్చి.. అరకొరగా పథకాలు అమలు చేసి.. అదీ అనేక ఆంక్షల పేరిట లబ్ధిదారులను తగ్గించేశారన్నారు. వ్యవసాయ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నారన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందుబాటులో ఉంచడంలో ఏమాత్రమూ శ్రద్ధ కనబరచడం లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు సక్రమంగా అమలు చేయకపోయినా సూపర్ హిట్ అయ్యాయని మభ్యపెడుతూ విజయోత్సవ సభలకు ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఇక ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. ఆయన పాలనను పక్కనపెట్టి సినిమాల్లో నిమగ్నమై పోయారని ఎద్దేవా చేశారు. రూ.267 విలువ కలిగిన యూరియా బస్తా ప్రైవేట్ మార్కెట్లో రూ.500 నుంచి రూ.600కు రైతులు కొనుగులో చేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్రానికి యూరియా సరఫరా అయ్యిందా.. లేక కూటమి నేతలు బ్లాక్ మార్కెట్ ద్వారా లబ్ధి పొందేందుకు యూరియాకు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, గిట్టుబాటు ధరలతో పంటల కొనుగోళ్లు, ఉచిత పంటల బీమా అమలు చేసి ఆదుకున్నారని గుర్తు చేశారు. ఎరువులు సక్రమంగా సరఫరా చేసి.. రైతుల సమస్యలు పరిష్కరించాలని నాయకులతో కలిసి ఆర్డీఓ సువర్ణకు వినతిపత్రం అందజేశారు.

తారస్థాయికి యూరియా కొరత

- రైతు సంక్షేమం పట్టని పాలకులు
- అన్నదాత పోరుతో ప్రభుత్వంలో వణుకు
- పోలీసులతో అడుగడుగునా అడ్డంకులు
- ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి మండిపాటు



ధర్మవరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: బ్లాక్‌మార్కెట్ కారణంగానే యూరియా కొరత తారస్థాయికి చేరిందని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి విమర్శించారు. యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలో నిల్చున్నా దొరకని దౌర్భాగ్య పరిస్థితులు తీసుకొచ్చారని కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. యూరియా సమస్యపై రైతులకు బాసటగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'అన్నదాత పోరు' మంగళవారం ధర్మవరంలో నిర్వహించారు. కేతిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌బీఐ కాలనీ నుంచి ధర్మవరం, తాడిమర్రి, ముదిగుబ్బ, బత్తలపల్లి మండలాల రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో కలిసి ర్యాలీ ప్రారంభించారు. అయితే పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. పట్టణంలోని ప్రధాన వీధులకు వెళ్లకుండా బారికేడ్లను ఉంచి అటకాయించారు. దీంతో ఆర్డీవో కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో కార్యాలయం ఎదురుగా నిర్వహించిన ధర్నాలో కేతిరెడ్డి ప్రసంగించారు. రాష్ట్రంలో యూరియా కోసం రైతులు బారులు తీరి వందల మంది రోజుల తరబడి వేచి చూస్తున్న దుర్భర పరిస్థితులు దాపురించడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం బస్తా యూరియా రూ.270 ఉంటే బ్లాక్‌లో రూ.600 కొనే పరిస్థితి ఏర్పడటం సిగ్గుచేటన్నారు. రైతులు అన్నం కోసం బఫేల వద్ద బారులు తీరుతున్నారంటూ సాక్షాత్తు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించి అవమానించారన్నారు. ఇక గత ఏడాది జిల్లాలో అత్యధికంగా ఈదురుగాలులకు, భారీ వర్షాలకు అరటి, చీని ఇతర పంటలు తీవ్రంగా దెబ్బతింటే ఇప్పటి వరకు పంట నష్టపరిహారం అందించకపోవడం కూటమి ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. బాబు పాలనలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. రైతుల పక్షాన నిలిచి వైఎస్సార్‌సీపీ 'అన్నదాత పోరు' తలపెట్టేసరికి రాష్ట్ర ప్రభుత్వంలో వణుకు మొదలైందన్నారు. అందుకే పోలీసుల చేత కార్యక్రమాన్ని ఎక్కడికక్కడ అడ్డుకునేందుకు చర్యలు చేపట్టిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా ఎప్పటికప్పుడు యూరియా, ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచి వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్డీఓ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు.

'రణభేరి'ని విజయవంతం చేయండి

ధర్మవరం అర్బన్: ఉద్యోగుల ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ఈ నెల 15 నుంచి 19 వరకు యూటీఎఫ్ తలపెట్టిన రణభేరిని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ధర్మవరంలో మంగళవారం 'యూటీఎఫ్ రణభేరి' పోస్టర్లను జిల్లా కార్యదర్శి రామకృష్ణనాయక్, ఉపాధ్యాయులతో కలిసి రాష్ట్ర కార్యదర్శి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర విద్యారంగ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో ఆన్‌లైన్, అప్ లోడింగ్ అంటూ బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని విమర్శించారు. విద్యాశక్తి కార్యక్రమాన్ని ఒకవైపు స్వచ్ఛందం అంటూనే మరోవైపు కచ్చితంగా కొనసాగించాలని ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని వాపోయారు. పరీక్షల మూల్యాంకనాన్ని ఉపాధ్యాయులకే పరీక్షగా మార్చేశారని విమర్శించారు. కార్యక్రమంలో ధర్మవరం పట్టణశాఖ అధ్యక్షులు జింకా హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి సాయిగణేష్, నాయకులు రామకృష్ణ, లక్ష్మయ్య, రాంప్రసాద్, హెచ్.రామంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులు మళ్లించొద్దు

ఎన్‌పీకుంట: సీఎస్ఆర్ నిధులను దారి మళ్లించకుండా మండల అభివృద్ధికే వినియోగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక శివాలయం వద్ద మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సోలార్ ప్లాంట్ నిర్మాణం కోసం వేల ఎకరాల భూములు సేకరించారని, భూములు కోల్పోయిన రైతులకు సరైన పరిహారం కూడా అందించలేదని అన్నారు. భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని చెప్పి ఎంత మందికి ఉద్యోగాలు కల్పించారో తెలపాలని ప్రశ్నించారు. సోలార్ కంపెనీ కేటాయించే సీఎస్ఆర్ నిధులను మండలాభివృద్ధికి ఉపయోగించాలన్నారు.

నాయీ బ్రాహ్మణ కుటుంబాలపై దాడి అమానుషం

కదిరి టౌన్: నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కసుమూరులో నాయీబ్రాహ్మణ కుటుంబాలపై దాడి చేయడం అమానుషమని నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఖండించారు. ఈ మేరకు మంగళవారం కదిరిలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలియజేసి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. తాగిన మత్తులో నాయీబ్రాహ్మణ కుటుంబాలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. నాయీబ్రాహ్మణులకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరి, రమణ, శ్రీరాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు చిన్నాభిన్నం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేష్‌బాబు

ధర్మవరం అర్బన్: మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే జీవితాలు చిన్నాభిన్నమవుతాయని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం అధికారి గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా డ్రగ్స్ వాడకం నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు మాట్లాడుతూ యువతలో డ్రగ్స్ వాడకం ఒక పెద్ద సమస్యగా మారుతోందన్నారు. ఆకర్షణ, స్నేహితుల ఒత్తిడి, కొత్త అనుభవం తెలుసుకోవాలనే ఆసక్తి వంటి కారణాలతో చాలా మంది విద్యార్థులు డ్రగ్స్ బారిన పడుతున్నారని తెలిపారు. కాని డ్రగ్స్ శరీరాన్ని, మనసును నశింపచేసే విషమన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మంచి స్నేహితులను ఎంచుకోవాలని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తక పఠనం వంటి మంచి అలవాట్లతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి పావని, అధ్యాపకులు చిట్టెమ్మ, త్రివేణి, షమీవుల్లా, కిరణ్‌కుమార్, పుష్పావతి, ఆనంద్, సరస్వతి, మీనా, ధనుంజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

కదం తొక్కిన రైతులు



కదిరిలో ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



ఎడ్లబండిపై వస్తున్న మక్బూల్, వైఎస్సార్‌సీపీ నేతలు

- ఎరువుల సరఫరాపై ప్రణాళికేదీ?
- కదిరిలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు, సమన్వయకర్త ధ్వజం

కదిరి టౌన్: యూరియా కోసం రైతులు కదం తొక్కారు. మంగళవారం కదిరిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో చేపట్టిన 'అన్నదాత పోరు'కు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తొలుత వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి నాయకులు కార్యకర్తలు ఇందిరాగాంధీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, వేమారెడ్డి, టవర్‌క్లాక్ మీదుగా చౌక్, కోనేరు, వీవర్స్‌కాలనీ వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రైతులకు అవసరమైన యూరియాను తక్షణమే సరఫరా చేయాలని నినాదాలు చేశారు. అనంతరం అక్కడి నుంచి సమన్వయకర్తతో పాటు రాష్ట్ర కార్యదర్శి పూలశ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.ప్రణీత్ రెడ్డి ఎద్దుల బండ్లపై ఆర్డీఓ కార్యాలయం వరకు వెళ్లి.. ఆర్డీఓ వి.వి.ఎస్.శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు రమేశ్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ తదితరులు మాట్లాడుతూ పంటలకు అవసరమైన యూరియాను సకాలంలో అందించాలని, పంటలకు గిట్టుబాటుధర కల్పించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎరువుల సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముందస్తు ప్రణాళిక ఏమీ లేదన్నారు. ఆయనకు వ్యవసాయం అంటేనే గిట్టదని.. అమరావతి అభివృద్ధి తప్ప ఏవీ పట్టడం లేదని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు విత్తు నుంచి పంట విక్రయం వరకు ప్రతి దశలోనూ అండగా ఉన్న విషయం గుర్తు చేశారు. ఆర్‌బీకేల ద్వారా రైతులు స్థానికంగానే వ్యవసాయ సేవలు పొందేలా చూశారన్నారు. ప్రస్తుతం ఆర్‌బీకేలను ఆర్‌ఎస్‌కేలుగా మార్చిన కూటమి ప్రభుత్వం.. సేవలను నిర్వీర్యం చేస్తూ.. రైతులకు ముప్పుతిప్పలు పెడుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్, మండల కన్వీనర్లు మణికంఠనాయక్, రవికుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, రంగారెడ్డి, ఫయాజ్, అశోక్‌వర్ధన్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ యాదవ్, కౌన్సిలర్లు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీతో అన్నదాత పోరుకు..



కదిరిలో నిర్వహించిన అన్నదాత పోరుకు గాండ్లపెంట, నల్లచెరువు, తనకల్లు నుంచి బైక్ ర్యాలీతో వెళ్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

నల్లచెరువు: యూరియా కొరత, రైతు సమస్యలపై కదిరిలో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమంలో పాల్గొనేందుకు వైఎస్సార్‌సీపీ నల్లచెరువు మండల కన్వీనర్ ఆధ్వర్యంలో రైతులు, నాయకులు, కార్యకర్తలు బైక్‌లతో ర్యాలీగా వెళ్లారు.

తనకల్లు: వైఎస్సార్‌సీపీ తనకల్లు మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు, రైతులు కదిరి ఆర్డీఓ కార్యాలయం వరకు బైక్ ర్యాలీతో వెళ్లారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ముస్తఫా, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: కదిరిలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో చేపట్టిన 'అన్నదాత పోరు'కు గాండ్లపెంట మండలం నుంచి నాయకులు బైక్‌లతో ర్యాలీగా వెళ్లారు. పార్టీ మండల కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు, రైతు సంఘం నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ మాజీ డైరెక్టర్‌లు, పార్టీ వివిధ కమిటీల సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులు తరలివెళ్లారు.

హామీల అమలులో 'కూటమి' విఫలం




ఎంసీ పల్లిలో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

రామగిరి: ఎన్నికల హామీల అమలులో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు విమర్శించారు. మంగళవారం ఎంసి.పల్లిలో చంద్రబాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేస్తోన్న మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్దన్న, ఎంపీటీసీ సభ్యురాలు ఆదిలక్ష్మి, అగ్రిబోర్డ్ మండల మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, మాజీ మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, రామ్మోహన్, నర్సిరెడ్డి, బండ్ల నారాయణరెడ్డి, నర్సన్న, రామలింగారెడ్డి, కర్రా విశ్వనాథ్‌రెడ్డి, బోయ నరసింహులు, ఉప్పర రామన్న, మహాత్మయ్య, ఎజ్జె ఆంజనేయులుతోపాటు తిమ్మాపురం, మంగాపురం, గరిమేకలపల్లి గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తికి తరలిన పార్టీ శ్రేణులు

నల్లమాడ: యూరియా కొరతపై వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పుట్టపర్తిలో జరిగిన అన్నదాత పోరుకు నల్లమాడ మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవ రెడ్డి, బీసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పారకల రమణ, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌హెచ్ బాషా, మాజీ కన్వీనర్లు కుళ్లాయినాయక్, పారకల రామాంజినేయులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ డీలర్లు తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.




ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయండి

గాండ్లపెంట: ఉమ్మడి జిల్లాలో పేదలకు సేవలందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేసి యథావిధిగా సేవలు కొనసాగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాంప్రసాద్ మంగళవారం డిమాండ్ చేశారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

కదిరి టౌన్: సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు వినియోగించే వస్తువులపై పన్ను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ మైనారిటీ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్‌లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే ఎమ్మెస్ పార్థసారథి హాజరయ్యారు.

ధైర్యంగా ఉండండి



సాగర్‌ను పరామర్శిస్తున్న మక్బూల్

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పూలరామక్రిష్ణ, కటారుపల్లి గొల్లపల్లి దళితవాడకు చెందిన కార్యకర్తలు సాగర్, లక్ష్మయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరిని మంగళవారం వైఎస్సార్‌సీపీ కదిరి సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ పరామర్శించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

యూరియా కోసం పాట్లు

నల్లచెరువు: యూరియా కోసం రైతులకు అగచాట్లు తప్పడం లేదు. మంగళవారం ఓరువాయి పంచాయతీలోని రైతు సేవ కేంద్రంలో సుమారు 500 మంది రైతులు యూరియా కోసం క్యూలో నిల్చున్నారు. అయితే 250 బస్తాల యూరియా మాత్రమే అందుబాటులో ఉందని అధికారులు చెప్పడంతో అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేటి మండల సమావేశం వాయిదా

బత్తలపల్లి: ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన బుధవారం జరగాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా చేసినట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కనగానపల్లి: మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని మహిళా శక్తి సొసైటీ సీఈఓ కాంచన సూచించారు. బద్దలాపురం గ్రామంలో మంగళవారం టింబక్టు కలెక్టివ్ సంస్థలోని మహిళా శక్తి సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవా సదస్సు నిర్వహించారు.

విజేత జట్టు సభ్యులకు సన్మానం

ఎన్‌పీకుంట: టీచర్స్ క్రికెట్ టోర్నీలో విజయం సాధించిన ఎన్.పీ.కుంట ఉపాధ్యాయ జట్టు సభ్యులకు మంగళవారం ఎమ్మార్సీలో ఎంఈఓ గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌టీఎఫ్, ఎస్టీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఎన్‌పీకుంట ఉపాధ్యాయ జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ మూడు సార్లు విన్నర్స్‌గా, రెండు సార్లు రన్నర్స్‌గా నిలిచిందని తెలిపారు. ఈ సంవత్సరం యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్‌టోర్నీలో ఎన్‌పీకుంట జట్టు రన్నర్స్‌గా నిలిచిందన్నారు.